సమగ్ర ప్రణాళికతోనే ధాన్యం సేకరణ

మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): సమగ్ర ప్రణాళికతోనే ధాన్యం సేకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. వానాకాలం పంట కొనుగోలుపై ఆయన సోమవారం ఐడీవోసీలోని సమావేశ మందిరంలో పౌర సరఫరాలు, సహకార, డీఆర్‌డీఏ, మార్కెటింగ్, జీసీసీ, వ్యవసాయ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణతో వానాకాలం ధాన్యం కొనుగోళ్లు పూర్తి పారదర్శకంగా జరగాలని అన్నారు. తరుగు కడ్తా పేరుతో రైతులు నష్టపోకుండా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలకు లోబడి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన పూర్తిస్థాయిలో మద్దతు ధర అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ త్రినాథ్, జిల్లా పౌర సరఫరాల అధికారి రుక్మిణి, జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, వ్యవసాయ అధికారి బాబురావు, జిల్లా రవాణా శాఖాధికారి సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఐడీవోసీలో ముగ్గుల పోటీలు

కలెక్టర్‌కు బతుకమ్మలు అందజేస్తున్న మహిళలు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్, స్వచ్ఛతాహీ సేవా 2024 కార్యక్రమాల్లో భాగంగా డీఆర్‌డీవో ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవాపై మహిళలకు ముగ్గుల పోటీలు సోమవారం ఐడీవోసీ ఆవరణలో జరిగాయి. స్వయం సహాయక సంఘాలు, మెప్మా, ఐసీడీఎస్‌కు చెందిన మహిళలు, ఐడీవోసీలోని ఉద్యోగినులు సుమారు 200 మందికి పైగా పాల్గొన్నారు. ముగ్గులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన వారికి బహుమతులు అందజేవారు., డీఆర్‌డీవో విద్యాచందన ఇతర అధికారులు పాల్గొన్నారు.

వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలి

ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ ముఖేష్‌కుమార్

రక్షణ చర్యలు వివరిస్తున్న కమాండర్ ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

భద్రాచలం, సెప్టెంబర్ 30: గోదావరి వరదల సమయంలో చేపల వేటకు వెళ్లిన వారు ఆకస్మాత్తుగా వరద పెరిగినప్పుడు అధైర్య పడకుండా లైఫ్ జాకెట్ల సహాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలిరావొచ్చని ఎన్‌డీఆర్ఎఫ్ కమాండర్ ముఖేష్‌కుమార్ అన్నారు. భద్రాచలంలో జాతీయ విపత్తుల స్పందన దళం సారథ్యంలో తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో బెటాలియన్ డీఎఫ్‌వోలు ఇమజ్, కోటేశ్వరరావు, మంగరాజు, నరేందర్ పాల్గొన్నారు.

కార్మికుల శ్రమ దోపిడీ సరికాదు

టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి

ఎస్ఓటూ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 30: లాభాల వాటా పంపిణీ లెక్కింపు సమయంలో గ్రూప్ పర్‌ఫార్మెన్స్ పేరిట కొండాపురం భూగర్భ గని కింద ఉన్న కార్మికులకు తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతోందని, దీనిని సరిచేసి కార్మికులకు న్యాయం చేయాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకట్ అన్నారు. సోమవారం ఈ మేరకు ఏరియా ఎస్ఓటూ జీఎం శ్యాంసుందర్‌కి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 346 మంది కార్మికులు కేపీయూజీ పేరిట ఉపరితల గనులకు డిప్యూటేషన్ ఆధారంగా ఉత్పత్తికి శ్రమించారన్నారు. లాభాల వాటా పంపిణీ లెక్కింపు సమయంలో కార్మికుడు ఏ మైన్‌లో మస్టర్ నమోదు అయ్యిందో ఆ మైన్‌కు చెందిన గ్రూప్ పర్‌ఫార్మెన్స్ కట్టించాల్సి ఉండగా, యాజమాన్యం పనిచేయని చోట గ్రూప్ పర్‌ఫార్మెన్స్‌ను పరిగణలోకి తీసుకోవడం వల్ల కొండాపురం గని పేరిట ఉన్న కార్మికులు సగటున 30-40 వేలు నష్టపోతున్నారని, కార్మిక శ్రమను దోపిడీ చేయడమే అవుతుందని తెలిపారు. యాజమాన్యం స్పందించి కార్మిక శ్రమకు తగిన ఫలితం అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్, మస్తాన్, చింతచెట్టి ముకేశ్, పద్దం శ్రీనివాస్, బత్తుల శ్రీనివాస్, వినయ్ కుమార్, మునిగెల నాగేశ్వరరావు ఉన్నారు.

పంచాయతీ కార్యాలయాలు, సీసీ రోడ్లు ప్రారంభం

వట్టంవారిగుంపు జీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

పినపాక (కరకగూడెం), సెప్టెంబర్ 30: మండలంలోని చిరుమళ్ల, వట్టంవారి గుంపులో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయాలను చొప్పాల, తాటిగూడెం, కరకగూడెం, వట్టంవారిగుంపు, గ్రామాల్లో నిర్మించిన సీసీ రోడ్లను సోమవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. చిరుమళ్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన గర్భిణులకు సీమంతాల కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం చిరుమళ్ల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అక్కడి మెనూ పాటించకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగప్రసాద్, ఎంపీడీవో కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో జయలక్ష్మి, ఎంఈవో మంజుల, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

భద్రాద్రి అదనపు కలెక్టర్ వేణుగోపాల్

భద్రాద్రి కలెక్టరేట్‌లో వినతులు స్వీకరిస్తున్న డీఆర్డీవో విద్యాచందన

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): సమస్యలపై పలువురు బాధితులు సమర్పించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించిన ఆయన వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్ చేశారు. సారపాకకు చెందిన మంగ తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని కోరారు. రైల్వే శాఖ పరిధిలో ఇల్లు కోల్పోయిన తమకు ప్రభుత్వం స్థలం ఇచ్చిందని, తన రమేశ్ పేరుపై ఉన్న పట్టాను అతడు చనిపోయినందున తన పైరు పైకి మార్చాలని కొత్తగూడెం మేదరబస్తీకి చెందిన కానుకుర్తి ధనలక్ష్మి కోరారు. సారపాక గాంధీనగర్‌కు చెందిన ప్రణవి.. తనకు భద్రాచలం లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో 8వ తరగతిలో ఫ్రీ సీటు ఇప్పించాలని కోరింది. ఉప్పుసాక పంచాయతీకి చెందిన ఆదివాసీలు, బీసీలు, లంబాడీలు తమకు విద్యుత్ సౌకర్యంతోపాటు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దశాబ్దాల క్రితం కట్టిన కాల్వలు మునిగిపోయి తమ ఇళ్లలోకి నీళ్లు వచ్చాయని, వెంటనే కాల్వలు పెద్దగా చేసి సమస్యను పరిష్కరించాలని పాల్వంచ పట్టణం దమ్మపేట మెయిన్ రోడ్ నుంచి శివనగర్ ప్రాంత వాసులు వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో డీఆర్డీవో విద్యాచందన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బాధితుల సమస్యలపై సత్వరమే స్పందించాలి

పోలీస్ అధికారులతో ఎస్పీ రోహిత్ రాజు

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 30: పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాధితుల సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని, వారికి త్వరగా న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు అన్నారు. ఆయన సోమవారం తన కార్యాలయంలో 'గ్రీవెన్స్ డే' నిర్వహించారు. 13 మంది బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి, వారితో మాట్లాడారు. తమ కేసుల విచారణలో జాప్యం జరుగుతున్నదని నలుగురు, తమ భూమికి సంబంధించిన వివాదాల విషయంలో న్యాయం చేయాలని ముగ్గురు, చోరీ జరిగిన తమ సొత్తును త్వరగా ఇప్పించాలని ఇద్దరు, కుటుంబ కలహాలతో నమోదైన కేసుల విషయం న్యాయం చేయాలంటూ నలుగురు అర్జీలు ఇచ్చారు. వీటిపై ఎస్పీ వెంటనే స్పందించారున. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడి, బాధితులకు వెంటనే న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

30 కేజీఎం క్రైం 2: రిటైర్డ్ ఏఎస్సైలను సన్మానించిన ఎస్పీ రోహిత్ రాజు

ఏఎస్సైలకు సన్మానం

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 30: పోలీస్ శాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి ఉద్యోగం విరమించిన ఇద్దరు ఏఎస్సైలను ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు సోమవారం తన కార్యాలయంలో సన్మానించారు. చుంచుపల్లి ఏఎస్సై శ్యామ్ సుందర్‌రావు, భద్రాచలం ట్రాఫిక్ ఏఎస్సై శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. వారికి ఎస్పీ రోహిత్ రాజు శాలువాలను కప్పి సన్మానించారు. ప్రభుత్వం నుంచి అన్ని రకాల ప్రయోజనాలు త్వరగా అందేలా చూడాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులతో చెప్పారు. ఎస్పీ ఇన్‌స్పెక్టర్ మడిపెల్లి నాగరాజు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఏసోబు, తదితరులు పాల్గొన్నారు.

ఆటల సందడి ముగిసింది

ఇల్లెందు రూరల్: క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులు

దమ్మపేట: విజేతలు

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 30: గిరిజన క్రీడా పాఠశాలల విద్యార్థులకు మండలంలోని కిన్నెరసానిలో జరిగిన క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం ముగిశాయి. మొదటి రోజు ఆదివారం బాలికల పోటీలు జరిగాయి. 102 మంది ఎంపిక య్యారు. సోమవారం బాలురకు జరిగిన పోటీల్లో 110 మంది ఎంపికయ్యారు. అక్టోబర్‌లో జరిగే జోనల్ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారు. హెచ్ఎం రామారావు, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటనారాయణ, ఉపాధ్యాయులు బాలసుబ్రమణ్యం, నర్సయ్య, సైదులు, రమేష్, గోపాల్ రావు, రవి, పీఈటీలు అంజయ్య, సావిత్రి, రాంబాబు, నాగమణి, సదర్‌లాల్, వాసు, ప్రసాద్, సందీప్‌మండల్ పాల్గొన్నారు.

దమ్మపేట, సెప్టెంబర్ 30: మండలంలోని పార్కెలగండి ఆశ్రమ పాఠశాలలో రెండు రోజుల పాటు జరిగిన డివిజనల్ స్థాయి క్రీడాపోటీలు సోమవారం ముగిసాయి. అండర్-14, అండర్-17 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ పోటీలు జరిగాయి. జిల్లాస్థాయి పోటీలకు ప్రతిభావంతులను నిర్వాహకులు ఎంపిక చేశారు.

ఇల్లెందు రూరల్, సెప్టెంబర్ 30: మండలంలోని బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలో సోమవారం అండర్-14, అండర్-17 జోనల్ స్థాయి క్రీడాపోటీలు ముగిశాయి. ఇల్లెందు, టేకులపల్లి, ఆళ్ళపల్లి, గుండాల మండలాల నుంచి 229 మంది విద్యార్థులు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ ఆడారు. ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనసరి నాగమణి, పీడీలు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 30: డీఎస్సీ-2024కు 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను అక్టోబర్ 1 నుంచి 4వ తేదీ వరకు పాత కొత్తగూడెం జిల్లాపరిషత్ పాఠశాలలో పరిశీలించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు హాజరుకావాలని పేర్కొన్నారు. 1వ తరగతి నుంచి అత్యధిక విద్యార్హత వరకు గల స్టడీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రం, టెట్ అర్హత ధ్రువపత్రం, అంగవైకల్యం/క్రీడా కోటాలో దరఖాస్తు చేసుకున్న వారు సంబంధిత ధ్రువీకరణ పత్రం, అన్ని విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ మెమోలు, ప్రొవిజనల్ సర్టిఫికెట్లతోపాటు రెండు సెట్ల జిరాక్స్‌లతో సకాలంలో హాజరుకావాలని వివరించారు.

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తుల స్వీకరణ

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 30: ఉచిత విద్యుత్ కోసం మండలంలోని కొత్తకన్నాయిగూడెం పంచాయతీ గోగులపూడి గ్రామానికి చెందిన కొండరెడ్లు సోమవారం వినాయకపురం సబ్ స్టేషన్‌లో ఏఈ సంతోష్‌కు దరఖాస్తులు ఇచ్చారు. 500 వాట్స్ వరకు ఒక ఫ్యాన్, బల్బు, టీవీ వినియోగించుకోవచ్చని చెప్పారు. 501 వాట్స్ నుంచి మీటర్ రీడింగ్ ప్రకారం బిల్లు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, లైన్‌మన్ రాజు, సిబ్బంది కోపాల కనకారెడ్డి, రాజా రెడ్డి, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌జీటీలో జిల్లా 3వ ర్యాంక్

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబర్ 30: సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ) పరీక్ష ఫలితాల్లో జిల్లా 3వ ర్యాంకును మండలంలోని వినాయకపురం గ్రామానికి చెందిన రొయ్యల గణేష్ సాధించాడు. ఇతడు వినాయకపురంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 7వ తరగతి, కొత్త మామిళ్లవారిగూడెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి, అశ్వారావుపేటలోని వీకేడీవీ జూనియర్ కళాశాలో 2016లో ఇంటర్, 2019లో ఖమ్మంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో టీటీసీ, 2023లో సత్తుపల్లి ప్రభుత్వ డీగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఈయనది నిరుపేద కుటుంబం. ఆయనను గ్రామస్తులు సోమవారం శాలువా కప్పి సన్మానించారు.

మాలమహానాడు మహిళా కమిటీ ఎన్నిక

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 30: మాలమహానాడు పట్టణ మహిళా కమిటీని సోమవారం జరిగిన సమావేశం ఎన్నుకుంది. అధ్యక్షురాలిగా ముద్దమళ్ల రోహిణిదేవి, ఉపాధ్యక్షులుగా కొడుపుగంటి జ్యోతిర్మయి, కాగితాల శిరీష, పెయ్యల సత్యవతి, ప్రధాన కార్యదర్శిగా ఎలుక లక్ష్మి, సహాయ కార్యదర్శులుగా బర్ల రాధ, లింగంపల్లి సౌజన్య, లావణ్య, గంగమ్మ, మంద లత ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

సారపాక, సెప్టెంబర్ 30: బూర్గంపాడు మండలంలోని మోరంపల్లి బంజర గ్రామంలో జడ్పీఎస్ఎస్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న డి.బాబును సోమవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం సన్మానించింది. 2024 సంవత్సరానికి రాష్ట్రస్థాయి అవార్డు పొందిన సందర్భంగా సన్మానించారు.

పీఎం జుగల్ స్కీమ్‌పై సమీక్ష

చండ్రుగొండ, సెప్టెంబర్ 30: పీఎం జుగల్ స్కీమ్ అమలుపై విద్యుత్ శాఖ ఏడీఈ ఎండి.యాసిన్ సోమవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో అన్నపురెడ్డిపల్లి, చండ్రుగొండ మండలాల అధికారులతో సమీక్షించారు. ఏఈలు నరసింహారావు, సాయితరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో బతుకమ్మ వేడుక

దమ్మపేట, సెప్టెంబర్ 30: మండలంలోని అంకంపాలెం, పెద్దగొల్లగూడెం ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి సోమవారం బతుకమ్మ వేడుక చేసుకున్నారు. ఆటపాటలతో సందడి చేశారు.

గ్రామీణ నీటి సహాయకులకు శిక్షణ

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 30: గ్రామీణ నీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమం దమ్మపేట మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రారంభమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కృష్ణసాగర్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణారోగ్యం

దమ్మపేట రూరల్, సెప్టెంబర్ 30: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని దమ్మపేట సీడీపీవో హేమ సత్యా అన్నారు. దమ్మపేట-1 అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ అభయాన్ కార్యక్రమంలో భాగంగా సీమంతాలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పోషకాహారం ప్రాధాన్యాన్ని వివరించారు. సూపర్‌వైజర్ సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈ కావ్య బదిలీ

పినపాక, సెప్టెంబర్ 30: మండల విద్యుత్‌శాఖ ఏఈ కావ్య ఖమ్మం బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఆమె రిలీవ్ అయ్యారు. 2 సంవత్సరాలుగా మండలంలో విద్యుత్‌శాఖ ఏఈగా విధులు నిర్వహించిన కావ్య అంకితభావంతో పనిచేసి మండల ప్రజల మన్ననలు పొందారు.

జీసీసీ డీఎంగా సమ్మయ్య

భద్రాచలం, సెప్టెంబరు 30: భద్రాచలం గిరిజన సహకార సంస్థ డిపో మేనేజరుగా పడిపె సమ్మయ్య సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు పనిచేసిన దావీదు పదవీ విరమణ చేయడంతో సమ్మయ్య బాధ్యతలు స్వీకరించారు.

మజీద్ కమిటీకి అభినందన

అశ్వారావుపేట, సెప్టెంబర్ 30: అశ్వారావుపేట మజీద్ కమిటీ నూతన కమిటీని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అభినందించారు. సామాజిక బాధ్యతతో పని చేయాలని కోరారు.

తెలంగాణ హైస్కూల్‌లో స్వచ్ఛ శ్రమదానం

కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 30: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా తెలంగాణ హైస్కూల్‌లో అధికారులు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు సోమవారం శ్రమదానం చేశారు. స్కూల్ ఆవరణను శుభ్రపరిచారు. ఎంఈవో ప్రభుదయాళ్, మాజీ ఎంఈవో జుంకీలాల్, ప్రిన్సిపాల్ లక్ష్మి, ఎన్‌సీసీ ఆఫీసర్ వీరూనాయక్, వాప్ ప్రతినిధి రవి పాల్గొన్నారు.

జూలూరుపాడు ఏఎస్సైకి అభినందన

కొత్తగూడెం క్రైం, సెప్టెంబర్ 30: విధి నిర్వహణలో ప్రతిభను కనబరిచి, 'బెస్ట్ ఎంక్వైరీ ఆఫీసర్'గా డీజీపీ జితేందర్ నుంచి ఇటీవల ప్రశంసాపత్రం అందుకున్న జూలూరుపాడు ఏఎస్సై బి.తిరుపతిరావును ఎస్పీ రోహిత్ రాజు తన కార్యాలయంలో సోమవారం అభినందించి సత్కరించారు. కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణాప్రతాప్, పీఆర్‌వో దాములూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మంత్రికి ఎన్‌హెచ్ నిర్వాసితుల వినతి

మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కోరం కనకయ్య, బాధితులు

టేకులపల్లి, సెప్టెంబర్ 30: టేకులపల్లిలో నేషనల్ హైవే(ఎన్‌హెచ్) విస్తరణతో ఇండ్లు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని కోరుతూ ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో బాధితులు సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు కోరం సురేందర్, ఇస్లావత్ రెడ్యా, భద్రు, మూడ్ సంజయ్, గడ్డం మధురెడ్డి, మోకాళ్ళ పోశాలు తదితరులు పాల్గొన్నారు.

గౌహతి సెమినార్‌లో ఆయిల్‌ఫెడ్ అధికారులు

సెమినార్‌లో పాల్గొన్న ఆయిల్‌ఫెడ్ అధికారులు

అశ్వారావుపేట, సెప్టెంబర్ 30: అస్సాం రాజధాని గౌహతిలో నేషనల్ మిషన్ ఫర్ ఎడిబుల్ ఆయిల్స్ ఆధ్వర్యంలో సోమవారం ఆయిల్‌పాం సాగుపై సెమినార్ జరిగింది. ఆయిల్‌పాం సాగు ప్రాధాన్యాన్ని అస్సాం అగ్రికల్చర్, హార్టీకల్చర్ కమిషనర్లు, ఐఐఓపీఆర్ అధికారులు వివరించారు. టీజీ ఆయిల్‌ఫెడ్ నుంచి డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ, సీనియర్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు పంపిణీ

విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

పినపాక (కరకగూడెం), సెప్టెంబర్ 30: మాతృ అభయ ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని కరకగూడెం, అనంతారం, చొప్పాల, శ్రీరంగాపురం, రేగుళ్ల, చిలకలగుంపు గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు సోమవారం పుస్తకాలు, దుస్తులు, స్కూల్ బ్యాగులు, పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. ఏజెన్సీ గ్రామాల్లో చదువుతున్న పేద విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. పేద విద్యార్థులకు విద్యాపరంగా తమ ట్రస్ట్ ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జాడి మురళీధర్‌రావు, పినపాక మాజీ జడ్పీటీసీ జాడి జానమ్మ తదితరులు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం

సాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 30: మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేటకు చెందిన పాయం రాజశేఖర్ (40)అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ కుటుంబాన్ని మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జగన్ మోహన్, రాయల ప్రేమ్‌కుమార్, గ్రామ పెద్దలు వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఎక్స్‌లెంట్ విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్లు

మణుగూరు టౌన్, సెప్టెంబర్ 30: జిల్లా కేంద్రంలోని ప్రకాశం స్టేడియంలో నిర్వహించిన జోనల్ క్రీడల్లో మణుగూరు ఎక్స్‌లెంట్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఎంపికైన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్లు ఖాదర్, యూసఫ్, యాకూబ్ షరీఫ్ అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అండర్ -14 కబడ్డీ విభాగంలో వఫీక, అండర్ -14 ఖోఖో విభాగంలో చారుణ్య సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం సంతోషించదగిన విషయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

591 మందికి రుణమాఫీ

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 30: పాల్వంచ మండలంలోని 591 మందికి రుణమాఫీ అయినట్లు సొసైటీ అధ్యక్షుడు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. సొసైటీ కార్యాలయంలో సోమవారం పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వీరిలో 219 మందికి రూ.86 లక్షల రుణాలు అందించినట్లు చెప్పారు. వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, ఏవో శంకర్, డైరెక్టర్లు కనగాల నారాయణ, పాపారావు, జనార్దన్ రెడ్డి, సీతారాంబాబు, వెంకటేశ్వరావు, కిషన్, వెంకటరమణ, సీఈవో లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ

కొత్తగూడెం టౌన్, సెప్టెంబర్ 30: మండల కేంద్రమైన సుజాతనగర్‌లోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి నర్మద సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం నిషేధించిన కలుపు మందులను విక్రయించకూడదని చెప్పారు.

రికార్డులను పరిశీలిస్తున్న ఏవో నర్మద